28 నుంచి బీఈడీలో ప్రవేశానికి చివరి కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈడీలో ప్రవేశానికి 2వ, చివరి విడత కౌన్సెలింగ్ వివరాలను మంగళవారం టీజీసెట్స్ కన్వీనర్ ప్రొ.పాండు రంగా రెడ్డి ప్రకటించారు. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 2 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన, 5, 6 తేదీల్లో వెబ్ ఆప్షన్స్, 7న ఎడిటింగ్, 11 సీట్లు సాధించిన అభ్యర్థుల జాబితా విడుదల, 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

రాంగోపాల్‌పేట్: మదర్ థెరీసా జయంతి సందర్భంగా మంగళవారం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ స్వరూపరాణి ఆధ్వర్యంలో 50 మంది వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. రెజిమెంటల్‌బజార్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద ఆమె జయంతి సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావులపాటి మోజస్, సాల్మన్‌రాజు, ఎడ్వర్డ్, డేవిడ్, ప్రసాద్, కవిత, గిరిజ, మేఘన తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ డిగ్రీని అందుకుంటున్న బాలకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం విద్యార్థి కొర్వి బాలకృష్ణముదిరాజ్‌కు డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఇంగ్లిష్ అధ్యాపకుడు ప్రొ.కొండనాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో హెన్‌హన్సింగ్ సాఫ్ట్‌స్కిల్స్ త్రో లిటరేచర్ ఎమాంగ్ స్టూడెంట్స్ ఆఫ్ ప్రొఫెషనల్ కోర్సు ఇన్ తెలంగాణ ఏ స్టడీ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించిన్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డా.నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు.

గొప్ప మానవతావాది మదర్ థెరిస్సా

ఎమ్మెల్యే శ్రీగణేశ్



రాంగోపాల్‌పేట్: గొప్ప మానవతావాది మదర్ థెరిస్సా అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా రెజిమెంటల్‌బజార్‌లోని ఆమె విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవ కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, వరలక్ష్మి యాదవ్, క్రైస్తవ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షులు మత్తయ్య, దళిత క్రైస్తవ ఐక్యవేదిక నాయకుడు మోజస్, క్రైస్తవ సంక్షేమ సంఘం నాయకులు యోహాన్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



ఓయూలో మాట్లాడుతున్న మహేశ్

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్‌రెడ్డి ఓయూలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ ఓయూలో ఊకదంపుడు ఉపన్యాసం చేసిన సీఎం ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. రెండేళ్లు గడుస్తున్న విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం, వర్సిటీల్లో నియామకాల గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, ఓయూకు రూ.1000 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్ అధ్యక్షుడు మంద నవీన్, ప్రధాన కార్యర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

పోలీసు నిబంధనలకు లోబడి ఉత్సవాలు



- అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు
- చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠాపనలు మొదలు, నిమజ్జనం కోసం విగ్రహాల ఊరేగింపుల వరకు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు పూర్తి చేసేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకున్నామని మంగళవారం విలేకరులకు వెల్లడించారు.

- మండపాల ఏర్పాటు, అనుమతులు విద్యుత్ సౌకర్యం విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మండపాల నిర్వాహకులకు అవగాహన కలిగించామని ఏసీపీ చెప్పారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, విగ్రహాల తరలింపు సందర్భాల్లో గతంలో ఎదురైన ఇబ్బందులను పరిగణలోనికి తీసుకొని ఆ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.
- శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం అయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి నిలుపుతున్నామన్నారు. ఇటువంటి సమస్యలను ముందే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకునేందుకు వారాసీగూడ, చిలకలగూడ, లాలాగూడ పోలీసు అధికారులకు అప్రమత్తం చేశామన్నారు.
- చిలకలగూడ సబ్‌డివిజన్ పరిధిలోని వారాసీగూడ పీఎస్ పరిధిలో 250 విగ్రహాలు, చిలకలగూడ పీఎస్ పరిధిలో 350 విగ్రహాలు, లాలాగూడ పీఎస్ పరిధిలో 155 విగ్రహాలు మొత్తంగా డివిజన్ పరిధిలో 755 విగ్రహాలు ప్రతిష్ఠించుకునేందుకు పోలీసు అనుమతులు పొందినట్టు ఏసీపీ చెప్పారు. మండపాన్ని పటిష్టంగా ఏర్పాటు చేయడం మొదలు భక్తులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ తీగలను అమర్చుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని ఉత్సవ నిర్వాహకులకు చెప్పామన్నారు.
- ప్రతీ విషయంలోనూ పోలీసులను సమన్వయం చేసుకునేలా మండప నిర్వాహకులు వ్యవహరించాలని, ఉత్సవాల నిమజ్జనోత్సవాల సందర్భంగా గొడవలకు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు.
- మూడు పీఎస్‌ల పరిధిలో 15 వరకు పికెటింగ్‌లు ఏర్పాటు చేసి నవరాత్రి వేడుకల నిర్వహణ వ్యవహారాలు సమీక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడి స్టేషన్ల సిబ్బంది, సిద్దిపేట, నల్గొండ జిల్లాల నుంచి వచ్చిన అదనపు బలగాలు కలుపుకొని 450 మంది పోలీసులతో ఉత్సవాల కోసం బందోబస్తును ఏర్పాటు చేశామని ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు.
- పోలీసుల నుంచి అనుమతి పొందిన ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు మాత్రమే జరగాలన్నారు. మండపాలు, ఉత్సవాల ముసుగులో అశ్లీల నృత్యాలు, మద్యం, మత్తు పదార్థాల వినియోగం, జూదం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపలకు ఎవరు పాల్పడేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు



ఆర్యనగర్‌లో ఉత్సవ నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ రఘుబాబు

లాలాపేట: వినాయక చవితి గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని లాలాగూడ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్యనగర్‌లో గణేశ్ ఉత్సవ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. గణేశ్ విగ్రహాలను తీసుకొని వచ్చేటప్పుడు, నిమజ్జనానికి తరలించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు తగిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. మండపాల వద్ద ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజు, ఆర్యనగర్ యువకులు హరికృష్ణ, జగదీష్, దేవేందర్, హేమంత్ కుమార్, చంద్రమౌళి, రాజు తదితరులున్నారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ

- వీధివీధినా వినాయక మండపాలు
- పత్రి కొనుగోళ్లలో బిజీబిజీ..





వినాయక విగ్రహాలు, పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

సనత్‌నగర్: నియోజకవర్గంలో గణేశ్ చతుర్థి సందడి మొదలైంది. వీధులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వినాయక చవితిని పురస్కరించుకొని మంగళవారం పూజా సామాగ్రి కొనుగోలుదారులతో మార్కెట్లు రద్దీగా మారాయి. ముఖ్యంగా వినాయక వ్రత నిర్వహణకు అవసరమయ్యే పత్రి, పూలతో పాటు గణపతి ఉత్సవ విగ్రహాల కొనుగోలుతో భక్తులు బీజీగా కనిపించారు. రోజువారీ ధరల కంటే పూల ధరలు రెట్టింపు స్థాయిలో ధరలు పలకడంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. చాలాచోట్ల ఎక్కువ శాతం మట్టి విగ్రహాలను కొనుగోలు చేసేందుకే ఆసక్తి కనబరచడంతో విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రధానంగా అమీర్‌పేట్ కనకదుర్గా దేవాలయ పరిసర ప్రాంతాలు, ఎర్రగడ్డ ప్రధాన రహదారి, సనత్‌నగర్ మార్కెట్ సెంటర్, బేగంపేట్ ప్రకాశ్‌నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక పూజా సమాగ్రి విక్రయాలు జోరుగా కొనసాగాయి. ఇదిలా ఉంటే కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పోలీసుల బందోబస్తు..

సనత్‌నగర్, బేగంపేట్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో దాదాపు 500 వినాయక మండపాలను ఏర్పాటుచేశారు. ఇప్పటికే పీస్ కమిటీ సమావేశాల ద్వారా శాంతి భద్రతలపై సూచనలు జారీ చేశారు. లౌడ్ స్పీకర్లను నిర్ణీత సమయాల్లో పరిమిత శబ్దంతో ఆధ్యాత్మిక, భక్తి పాటలను మాత్రమే వినిపించాలని ఆయా స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, ప్రసాదరావు స్పష్టం చేశారు.





తుకారాంగేట్‌లో వెలిసిన గణపతి విగ్రహాల దుకాణాలు

విద్యుత్ సమస్యలపై బస్తీ బాట

రాంగోపాల్‌పేట్: విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారం కోసం ఉన్నత స్థాయి అధికారులందరూ బస్తీ బాట పట్టినట్లు మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం విద్యుత్ శాఖకు చెందిన ఎస్ఈ గోపయ్య, బస్తీ బాట పట్టారు. చీఫ్ ఇంజనీర్ మెట్రోజోన్ సాయిబాబా, ఎస్ఈ గోపయ్య, డీఈఈ బ్రహ్మానందం, ఏడీఈ శివప్రసాద్, ఆదినారాయణ, జనరల్‌బజార్ ఏఈ రవికుమార్ తదితర సిబ్బంది కలసి బర్థన్‌కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులతో మాట్లాడి విద్యుత్ సమస్యల గురించి ఆరా తీశారు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని అందుకే క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. అధికారులు, సిబ్బంది కూడా వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. కేబుల్ వైర్లు ప్రమాదకరంగా మారాయని అలాంటి వాటిని వెంటనే తొలగించాలని సూచించారు.



బస్తీ బాటలో ఉన్నతాధికారులు

తొలగించిన కేబుల్ వైర్లు

విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసి ప్రమాదకరంగా వేలాడుతున్న డిష్, ఇంటర్నెట్ వైర్లను ఎస్పీడీసీఎల్ జనరల్‌బజార్ అధికారులు తొలగించారు. కొద్ది రోజులుగా ఈ కేబుల వైర్ల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టిన సంగతి తెలిసింది. మంగళవారం కళాసీగూడ, ఎస్డీరోడ్ తదితర ప్రాంతాల్లో వీటిని తొలగించారు.

గాంధీలో హెపటైటిస్ బీ వ్యాక్సిన్ స్పెషల్‌డ్రైవ్



హెపటైటిస్ బీ వ్యాక్సిన్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారి

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో హెపటైటిస్ బీ వ్యాక్సిన్ సెకెండ్ డోస్ స్పెషల్‌డ్రైవ్‌ను మంగళవారం ప్రారంభించారు. ప్రధాన భవనం ఫస్ట్‌ఫ్లోర్‌లోని జెరియాట్రిక్ వార్డులో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి ప్రారంభించారు. ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, ఫోర్త్‌క్లాస్, పారిశుధ్య సిబ్బంది ప్రతీ ఒక్కరు హెపటైటిస్ బీ వ్యాక్సిన్‌ను వేసుకోవాలని ఆమె సూచించారు. మొయినాబాద్ రోటరీక్లబ్ నేతృత్వంలో నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో సుమారు 500 మందికి వ్యాక్సిన్ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ఫార్మసీ ఇన్‌చార్జి మధుసుధాకర్‌రెడ్డి, ఆర్ఎంఓ రజనీ తదితరులు పాల్గొన్నారు.

తలసాని వియ్యంకుడి మృతి



రాజ్‌కుమార్‌గౌడ్ పాడే మోస్తున్న ఎమ్మెల్యే

కంటోన్మెంట్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వియ్యంకుడు మూల రాజ్‌కుమార్‌గౌడ్ సోమవారం గుండెపోటుతో మరణించారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం రాయదుర్గంలోని శ్మశాన వాటికలో నిర్వహించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్ పాడే మోశారు. బంధు మిత్రులు, తలసాని అభిమానులు పెద్ద సంఖ్యలో అంత్యక్రియలకు హాజరయ్యారు.

హబ్సిగూడ రహదారిలో ప్రమాదం



ట్రాలీ వాహనంపై నుంచి రోడ్డుపై జారిపడ్డ ఐరన్ రేకులు

లాలాపేట: హబ్సిగూడ సిగ్నల్ చౌరస్తాపై వరస ప్రమాదాలకు కేరాఫ్‌గా నిలుస్తుంది. ట్రాలీ వాహనంపై నుంచి ఐరన్ రేకులు జారిపడి ముందు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారురాలికి గాయాలైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హబ్సిగూడకు చెందిన సంధ్యారెడ్డి(43) తార్నాక వైపు నుంచి ద్విచక్ర వాహనంపై హబ్సిగూడకు వెళ్తుంది. హబ్సిగూడ చౌరస్తాలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళపై వేగంగా దూసుకొచ్చిన ట్రాలీ వాహనంపైన ఐరన్ రేకులు పడి ఆమె చేతికి గాయాలయ్యాయి. ట్రాలీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. డ్రైవర్ కుందన్ కుమార్(25)ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగంలో సమస్యలు

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



మైత్రివనం చౌరస్తాలో నిరసన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అమీర్‌పేట: విద్యారంగంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏబీవీపీ సెక్రటరీ మాచర్ల రాంబాబు అన్నారు. సికింద్రాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో అమీర్‌పేట మెట్రో వద్ద నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఎంతో వరంగా ఉండే ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయకపోవడంతో వారు నష్టపోతున్నారని తెలిపారు. నిరసన చేపట్టిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు బాలకృష్ణ, నందు పాల్గొన్నారు.

'స్పోర్ట్స్ కోటాను అమలు చేయండి'

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటాను అమలు చేయాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీగేట్-2025 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అన్ని కోర్సుల అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటను అమలు చేస్తుండగా, పీజీ అడ్మిషన్లలో రద్దు చేయడం దారుణమన్నారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు మరోక అవకాశం ఇవ్వాలని తెలిపారు.

రహదారులు, విద్యుత్ సమస్యలకు పరిష్కారం



సికింద్రాబాద్: వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ చెప్పారు. మంగళవారం సీతాఫల్‌మండి నామాలగుండు వార్డు కార్యాలయంలో మట్టి గణపతుల విగ్రహాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల గణపతి మండపాల ఏర్పాటును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే డివిజన్ పరిధిలో మండపాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలు, విగ్రహాలు నిమజ్జనం కోసం తరలివెళ్లే రహదారుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో గుంతలు పూడ్చడం, చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ వైర్ల మరమ్మతు పనులు చేయించాల్సి ఉందన్నారు. సత్వరమే సదరు పనులను ఆయా విభాగాల అధికారులు పూర్తి చేయాలని సామల హేమ కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

వినాయక చవితి సందర్భంగా ఆయా డివిజన్లల్లో మంగళవారం ఆయా పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ప్రజలకు మట్టి గణపతులను పంపిణీ చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. మట్టి గణపతులను ప్రతిష్ఠించి, పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. హానికరమైన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లతో చేసిన విగ్రహాలతో నిమజ్జనం చేస్తే, నీటి వనరులు కలుషితమవుతాయని పేర్కొన్నారు.

– కంటోన్మెంట్, సనత్‌నగర్, సికింద్రాబాద్ జోన్ బృందం



మట్టి గణపతులు పంపిణీ చేస్తున్న డీసీపీ రష్మీ పెరుమాళ్



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న బోర్డు సీఈఓ మధుకర్ నాయక్



లాలాపేటలో మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి



బేగంపేటలో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అమరావతి సంస్థల విద్యార్థులు



గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న వెల్లాల రామ్మోహన్



అడ్డగుట్టలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



ఆలయ చైర్మన్ సాయిబాబాగౌడ్‌కు మట్టి వినాయక ప్రతిమ అందజేసిన పాలక మండలి సభ్యులు



తార్నాకలో ..



చిలకలగూడలో వీబీజీఎఫ్ ప్రతినిధులు